క్లుప్తంగా

10న నులిపురుగుల నివారణ దినం

బొల్లాపల్లి: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 10న ప్రతి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు టాబ్లెట్లు పంపిణీ చేయనున్నట్లు వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి. వీరనరేష్ సోమవారం తెలిపారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్యసిబ్బంది ద్వారా టాబ్లెట్లు అందజేశామని తెలిపారు.

12 వరకు మిషన్ ఇంద్రధనస్సు

శావల్యాపురం: మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో ఈనెల 12 వరకు జరుగుతుందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా నేటివరకు ఎటువంటి టీకా పొందని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ప్రపంచ నులిపురుగుల దినోత్సవం కార్యక్రమంలో ఈనెల 10న జరుగుతుందని 18 సంవత్సరాల లోపు చిన్నారులను గుర్తించి వారందరూ అల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు మింగించాలన్నారు. ఆయనతో పాటు సూపర్‌వైజర్లు ఏడుకొండలు, సాయిగీతా, ఉమదేవి ఉన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి



బొల్లాపల్లి: విద్యుదాఘాతానికి గురై భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన షేక్ సైదా (33) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అదే గ్రామంలోని ఓ ఇంటికి సిమెంటు పనితో మరమ్మతులు చేస్తూ 11 కె.వి.విద్యుత్ లైన్ తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. క్షతగాత్రుడిని వినుకొండ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బండ్లమోటు ఎస్సై జి. రవికృష్ణ తెలిపారు. మృతుడికి భార్య కరీష్మా, ఇరువురు సంతానం ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

నరసరావుపేట టౌన్: తనను కులం పేరుతో దూషించడంతో పాటు అకారణంగా దాడి చేశాడని బాధితుడిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్ర బాబు సోమవారం తెలిపారు. కోటప్పకొండ రోడ్డు శ్రీనివాస నగర్‌కు చెందిన నవీన్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తుంటాడు. నవీన్‌పై వారం రోజుల క్రితం మద్దూరి భాస్కర్‌రెడ్డి దాడికి పాల్పడ్డాడు. విషయంపై నవీన్ అతని స్నేహితులు వెళ్లి ప్రశ్నించగా మరోమారు భాస్కర్‌రెడ్డి దాడికి పాల్పడి దూషించాడు. ఈ మేరకు బాధితుడిచ్చిన ఫిర్యాదుతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దాడి కేసు నమోదు చేశామన్నారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ తెలిపారు.

గద్దర్ పాటకు మరణం లేదు



చిలకలూరిపేటటౌన్: పేద ప్రజల కోసం గద్దర్ తన పాటను, జీవితాన్ని అంకితం చేశారని ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు చెప్పారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో సోమవారం ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పేద, దళిత, అణగారిన వర్గాల్లో చైతన్యం నింపిన, సమసమాజం కోసం పోరాడారని వివరించారు. ఆయన పాట పీడిత పోరాటాలకు దిక్సూచీగా నిలిచిందని వెల్లడించారు. కార్యక్రమంలో జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు, ఉప్పాల భాస్కరరావు, గోరంట్ల నారాయణ, చుక్కా విన్సెంట్‌పాల్, కస్తూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాటతో చైతన్యపరిచారు

నరసరావుపేట ఈస్ట్: ప్రజాకవి గద్దర్ మృతి పట్ల సాహితీవేత్త, ఉమ్మడి ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ పాఠ్యపుస్తక రచయిత కుందా భాస్కరరావు సోమవారం ఒక ప్రకటనలో నివాళులర్పించారు. జనారణ్యాన్ని తన పాటలతో చైతన్యపరిచి చిగురింపచేసిన గండుకోయిల గద్దర్ భౌతికంగా దూరమైనా ఆయనపాట జనం గుండెల్లో మారుమ్రోగుతూనే ఉంటుందని తెలిపారు.

ఘనంగా జావలిన్‌త్రో దినోత్సవం

చిలకలూరిపేటటౌన్: టోక్యో ఒలింపిక్స్‌లో భారత దేశం తరుపున పాల్గొని బంగారుపతకం సాధించిన నీరజ్‌చోప్రా ప్రతిభకు గుర్తింపుగా ఆగస్టు 7వ తేదీన జాతీయ జావలిన్‌త్రో దినోత్సవంగా ప్రకటించారని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ హైస్కూల్ హెచ్ఎం కె.కృపాదానం చెప్పారు. పట్టణంలోని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్‌లో సోమవారం జాతీయ జావలిన్ త్రో దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జావలిన్ త్రోలో పోటీలు నిర్వహించి, గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సీఏవో మాసిలామణి, పీఈటీలు రాజు, రాజేష్‌లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శానిటేషన్, వీధిలైట్లు నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇటీవల జరిగిన జగనన్న సురక్ష పథకంలో ఎంతో మంది లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లు అందించామని, ఈ సర్టిఫికెట్ల ఆధారంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత మందికి అందే అవకాశం ఉన్నందున పరిశీలించాలన్నారు.

వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం



వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద మంజూరైన కారును ఓ యువకుడికి కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని మాదిపాడు గ్రామానికి చెందిన వై.గాబ్రియల్ నవోదయం ప్రోగ్రాంలో తనకు వాహనం కొనుగోలుకు రుణం కావాలని అర్జీ దరఖాస్తు చేశారు. కెనరా బ్యాంక్ సహకారంతో 45 శాతం సబ్సిడీతో డిజైర్ కారు మంజూరు చేశారు. అందులో భాగంగా మంజూరైన కారు తాళాలను కలెక్టర్ లబ్ధిదారునికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ కల్పనశ్రీ, నోడల్ ఆఫీసర్ సంజీవరావు, కన్వీనర్ ఓబుల్ నాయుడు, పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ బాలు నాయక్, ఎల్‌డీఎం శ్రీరాంప్రసాద్ పాల్గొన్నారు. –నరసరావుపేట

దివ్యాంగులకు చేనేత దుస్తులు



జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ ఆవరణలో పల్నాడు జిల్లా చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుస్తుల ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చేనేత దుస్తులను పంపిణీ చేశారు. స్వదేశీ దుస్తులను వినియోగించాలన్న దృక్పథం, చేనేతలలో స్ఫూర్తి నింపేందుకు దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేయడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. – నరసరావుపేట

డోర్ టు డోర్ సర్వే త్వరగా పూర్తి చేయాలి

బొల్లాపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులు సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ వి. సుధాకర్ శర్మ బీఎల్ఓలకు పలు సూచనలు చేశారు. ఈనెల 27 వరకు ఇంటింటి ఓటరు సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటి వరకు 26 శాతం మాత్రమే సర్వే పూర్తయిందని తెలిపారు. ఈ డోర్ టు డోర్ సర్వేలో డబుల్ ఓట్లు గుర్తించడం, బోగస్, చనిపోయిన ఓట్లను గుర్తించడం, ఒకే డోర్ నెంబర్‌లో పది మందికి పైగా ఉన్నటువంటి ఇళ్లను గుర్తించడం తదితర సర్వే వివరాలు పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. ఫారం 6,7,8 క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. 80 ఏళ్ల పైబడి వారి ఓట్లు గుర్తించాల్సి ఉందన్నారు. పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిశీలించాలని సూచించారు. మొత్తం 61 మంది బీఎల్ఓలు మండలంలోని విధులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు. సమీక్షలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జానీబాషా, ఆర్ఐ రాజ్‌కోటయ్య, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

వివక్ష లేని సంక్షేమమే ధ్యేయం

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- యడ్లపాడులో మూడవ రోజు కొనసాగిన గడప గడపకు కార్యక్రమం



యడ్లపాడులో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజని

యడ్లపాడు: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అర్హతే ప్రామాణికమని, కుల, మత, వర్గ, పార్టీ వంటి వివక్షత లేకుండా పారదర్శకంగా వాటిని ప్రజలకు అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. యడ్లపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం మూడోరోజు నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి రజినికి పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. గ్రామంలోని నుంచి ఇంటింటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా గత నాలుగేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ లబ్ధిని వివరిస్తూ... స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశిస్తూ ముందుకు సాగారు. తొలుత మసీదు వెనుక బజార్ నుంచి చాకలిపాలెం, శివాలయం బజారు, ముస్లింవాడ, ఆర్యవైశ్యులు వీధి, రచ్చబండ సెంటర్, బీసీ కాలనీ, మంగళ కాలనీ, కంసలీ కాలనీల్లో పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు.

ప్రతీ కుటుంబానికి లబ్ధి

ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. స్థానిక ప్రజలతో మంత్రి మాట్లాడుతూ ప్రతి రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయం నిర్మించి వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా స్థానికంగానే గ్రామీణ ప్రజలు ప్రభుత్వ సేవలు పొందేలా సచివాలయాల్లో 12 శాఖలకు సంబంధించిన అధికారులను నియమించిన విషయాన్ని ప్రజలు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు పొందని వారికి దక్కేలా చేసేందుకు తమ ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించిందన్నారు. నెలరోజుల పాటు ఈ కార్యక్రమం ద్వారా 11 రకాలకు చెందిన పౌరసేవలను ఉచితంగా అందించడం జరిగిందన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రజల అవసరాలను గుర్తించి వాటిని అర్జీల రూపంలో అందించగా వాటిని అధికారులు పరిశీలించిన వేగంగా పరిష్కరించడం జరిగిందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ, ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇటువంటి సేవలు అందించిన ఈ కార్యక్రమానికి అంతటా ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల నుంచి 3612 రకాల సర్టిఫికెట్లను ఎవరి సిఫార్సు లేకుండా నేరుగా ఉచితంగా లబ్ధిదారులకు అందించిన విషయాన్ని మంత్రి రజిని గుర్తు చేశారు. నిత్యం ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ వినూత్న పథకాలతో పేదరికాన్ని రూపుమాపాలని కృషి చేస్తున్న మంచి మనసున్న జగనన్నకు అందరం అండగా ఉండి మళ్లీ దీవించాలని కోరారు.

కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైస్‌చైర్మన్ ఎం.వీరారెడ్డి, ఎంపీపీ పిడతల ఝాన్సీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఘంటా శంకర్, సొసైటీ చైర్మన్ బసెల శివరామకృష్ణ, ఓరుగంటి పూర్ణయ్య, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, సర్పంచ్ కారుచోల హేమ, ఎంపీటీసీ కీర్తి అరుణ్‌కుమార్, పార్టీ నాయకులు పి.దయాసాగర్, మాదం శ్రీను, కర్నాటి సుబ్బారావు, కురంగి నాగమల్లేశ్వరరావు, షాజహాన్, బండ్ల రామ్‌కుమార్, బొంత ప్రభుదాసు, యామర్తి కోటేశ్వరరావు, షేక్ షంషుజుహా, గౌస్‌సందాని, వలేటి ఉదయ్‌కుమార్, పఠాన్ తలహాఖాన్, ఆలోకం వెంకట లక్ష్మీ నారాయణ, వాసు, కె.శ్యామ్యేల్‌పాల్, ఎ.శ్యామ్‌పాల్, జంగా ప్రసన్న, పందుల బుల్లెబ్బాయి, ఎంపీ సుబ్బారావు, వేమలయ్య, సింగయ్య పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలి

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



డ్రెయిన్ల నిర్మాణంపై మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ఎన్‌హెచ్ఏఐ అధికారులు

చిలకలూరిపేట: పట్టణ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా ప్రధాన డ్రెయిన్ల నిర్మాణం వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. జాతీయ రహదారికి పట్టణ పరిధిలో ఇరువైపులా డ్రెయిన్లు శిథిలావస్థకు చేరిన కారణంగా కొత్త డ్రెయిన్ల నిర్మాణం కోసం జాతీయ రహదారుల అధికారులు, మున్సిపల్ అధికారులతో కలసి డ్రెయిన్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని మాట్లాడుతూ గతంలో పట్టణ పరిధిలో జాతీయ రహదారి ఆరు లైన్లుగా విస్తరించటమా, లేక బైపాస్ నిర్మాణమా అనే సంశయం ప్రస్తుతం లేదని, బైపాస్ రోడ్డు నిర్మాణం వేగవంతంగా జరుగుతున్న నేపథ్యంలో పట్టణ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా వెంటనే డ్రెయిన్లు నిర్మించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ విషయాన్ని పురపాలక సంఘం తరుపున అనేకసార్లు ఎన్‌హెచ్ఏఐ అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. అయినా పనులు మాత్రం కొనసాగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని జోక్యం చేసుకోవడంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పందించి పరిశీలనకు రావడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. ముఖ్యంగా అడ్డరోడ్డు సెంటర్ నుంచి సంజీవ నగర్ వరకు మురుగునీరు ప్రవహించక వర్షాలు కురిసిన ప్రతిసారి సంజీవ నగర్ ప్రాంతం ముంపునకు గురౌతున్నదని ఎన్‌హెచ్ఏఐ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జాతీయ రహదారికి పడమర వైపు ఓగేరు వాగు నుంచి సాయి కార్తీక్ సెంటర్ వరకు, ఏఎంజీ నుంచి గణపవరం డొంక వరకు, జాతీయ రహదారికి తూర్పు వైపు విజయ బ్యాంకు సెంటర్ నుంచి ఓగేరు వాగు వరకు డ్రెయిన్ల నిర్మాణం సుమారు రూ.4 కోట్లతో నిర్వహించేందుకు ప్రతిపాదనలు రూపొందిస్తామని ఎన్‌హెచ్ఏఐ అధికారులు తెలిపారు. దీనికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల అధికారులు ప్రసాద్, అశోక్, జగదీష్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, డీఈఈ తోట వెంకటరమణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు షేక్ ఇస్మాయిల్, శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టబోయే బిడ్డ సంక్షేమం కోసమే..



బాలింతకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందచేస్తున్న షకీలా

వినుకొండ టౌన్: పుట్టబోయే బిడ్డ ఎదుగుదలకు, సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేయడం జరుగుతుందని కౌన్సిలర్ షేక్ దస్తగిరి షకీలా పేర్కొన్నారు. పట్టణంలోని కుమ్మరి బజార్ 1 పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో సీడీపీఓ అనురాధ ఆధ్వర్యంలో గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ, తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరుకాగా బాలింతలకు సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీతోపాటు గర్భిణులకు సీమంతం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ మరియకుమారి, ఏఎన్ఎం వెంకట నరసమ్మ, మహిళా పోలీసు స్వాతి, అంగన్వాడీలు ఎ.రత్నకుమారి, ఉమామహేశ్వరి, వార్డు ఇన్‌చార్జ్ మోతాదు రఫీ, చెక్‌పోస్టు బాషా, ఎ. లోక్‌నాథ్, హెల్పర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గణపవరంలో...

నాదెండ్ల: తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం 1వ సచివాలయంలో సోమవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ టేక్ హోం రేషన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిధిలోని 18 అంగన్‌వాడీ సెంటర్లలో ఉన్న బాలింతలు, గర్భిణులకు కిట్లను అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తులం సుధాకర్, షేక్ ఆదంవలి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి శేఖర్, మహిళా పోలీసులు కోమలి, నాగలక్ష్మి, మీనా, సోయాని, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

పటిష్ట చట్టాలతోనే మహిళలకు రక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రమాదేవి

సత్తెనపల్లి: చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు కారణమైన మద్యం, మత్తు పదార్థాలు, అసభ్యకర సీరియల్స్, అశ్లీల చిత్రాల్ని అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా)రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి డిమాండ్ చేశారు. మహిళలపై హింస, మద్యం, మత్తు పదార్థాలరహిత సమాజాన్ని నిర్మిద్దాం అంటూ గత నెల 28న సత్యసాయి జిల్లాలో బయలుదేరిన మహిళా పోరుయాత్ర సోమవారం సత్తెనపల్లి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తాలూకా సెంటర్లో నిర్వహించిన బహిరంగ సభకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సభకు ఐద్వా సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ అధ్యక్షత వహించారు. రమాదేవి మాట్లాడుతూ 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ పార్టీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, హింస రోజురోజుకూ పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి మణిపూర్లో మహిళలపై జరిగిన ఘటన పరాకాష్ట కాదా? అని ప్రశ్నించారు. అశ్లీల, మద్యం వ్యతిరేక ఉద్యమ నాయకులు ఈదర గోపీచంద్ మాట్లాడుతూ అశ్లీల చిత్రాల్ని ప్రచురిస్తున్న పత్రిక యజమానులపై కేసులు పెట్టి శిక్షలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ముందుగా సత్తెనపల్లిలోకి వచ్చిన మహిళా పోరు యాత్రకు స్థానిక మహిళలు డప్పుల దళంతో వెళ్లి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి పెద్దిరాజు బృందం మహిళా చైతన్య పాటల్ని ఆలపించారు. ఈ సందర్భంగా పొత్తి కడుపులో అమ్మ ఉన్నది అనే పాటకు ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన నృత్య రూపకం ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్నది.

ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు డి. శ్రీనివాస కుమారి, గుంటుపల్లి రజని, పట్టణ అధ్యక్షురాలు మునగా జ్యోతి, కమిటీ సభ్యులు షేక్ ఆయేషా, కట్టా రమాదేవి, ఎం.రమాకుమారి, జి.నాగలక్ష్మి, ఆర్.శివపార్వతి, జి ఎలిసెమ్మ, కుమారి, కోటమ్మ, అనూష, లక్ష్మి, అమూల్య, సుజాత పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో ఖచ్చితత్వం ఉండాలి

బీఎల్‌వోలకు ఈఆర్‌వో ఆదేశం



మాట్లాడుతున్న వసంతబాబు

చిలకలూరిపేట: ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేని ఖచ్చితమైన వివరాలతో కూడిన జాబితా రూపకల్పనకు బీఎల్‌వోలు చిత్తశుద్ధితో పనిచేయాలని నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి జి. వసంత బాబు చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ హాలులో పట్టణ, చిలకలూరిపేట మండల పరిధిలోని బీఎల్‌వోలకు ఓటర్ల జాబితాపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో స్త్రీ, పురుష ఓటర్ల మధ్య వ్యత్యాసం అధికంగా ఉండరాదని వెల్లడించారు. వివాహం జరిగిన స్త్రీల తాలూకు ఓట్లు బదిలీ కాని కారణంగా పురుషుల కన్నా, స్త్రీ ఓట్లు జాబితాలో ఎక్కువగా ఉంటున్నాయని పేర్కొన్నారు. ఇలాంటివి గుర్తించి వ్యత్యాసం సరిచేయాలన్నారు. మరణించిన వారి, శాశ్వతంగా వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి ఖచ్చితమైన సమాచారం సేకరించాలని చెప్పారు. ఓట్లు తొలగించేటప్పుడు తప్పనిసరిగా సంబంధిత ఓటరుకు నోటీసు జారీచేసి మాత్రమే ఓట్లు తొలగించాలన్నారు. ఓట్ల తొలగింపు రెండు శాతానికి మించకుండా చూసుకోవాలన్నారు. అలాగే చేర్పులకు సంబంధించి నాలుగు శాతానికి మించకుండా చూసుకోవాలన్నారు. ఒకే అడ్రస్‌తో రెండు ఫొటోలతో ఉండటం వంటి విషయాలను క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు, చేర్పులు జాగ్రత్తగా చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిడిలకు లోను కాకుండా నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో పాలుపంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, తహసీల్దార్ జి. సుజాత, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ టీపీఎస్ కె.సునీత, సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన రొంపిచర్ల సొసైటీ చైర్మన్



రొంపిచర్ల: స్థానిక బొడ్రాయిసెంటర్లో గల సొసైటీ కార్యాలయంలో నూతన చైర్‌పర్సన్‌గా మేడికొండ వీరారెడ్డి సోమవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. అలాగే పర్సన్‌లుగా సరికొండ సత్యనారాయణరాజు, గానుగపంట చిన సుబ్బారెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పదవీబాధ్యతలు స్వీకరించిన రొంపిచర్ల సొసైటీ నూతన చైర్‌పర్సన్ మేడికొండ వీరారెడ్డి మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు సబ్సిడీపై విత్తనములు, ఎరువులు, పంట రుణాలు అందిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి, వైఎస్సార్‌సీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలి పారు. సొసైటీ నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన వీరారెడ్డిని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నెం పున్నారెడ్డి, చపారపు సంజీవరెడ్డి, పల్లెల మల్లికార్జునరెడ్డి (బాబు), మేడికొండ శ్రీనివాసరెడ్డి, పడాల రమణారెడ్డి, పల్లెల హనిమిరెడ్డి, సొసైటీ సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై చైతన్యం కల్పించాలి

ఉమ్మడి గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ వైద్యాధికారి కాట్రగడ్డ గిరిధర్ కుమార్



మాట్లాడుతున్న వైద్యాధికారి గిరిధర్

శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరూ ఫ్లోరోసిస్ బారిన పడకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది నిరంతరం ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ఫ్లోరిసిస్ వైద్యాధికారి కాట్రగడ్డ గిరిధర్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్లోరోసిస్ వ్యాధి నియంత్రణపై వైద్య ఆరోగ్య సిబ్బంది సమీక్షించారు. ఈ సందర్భంగా గిరిధర్ కుమార్ మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 439 గ్రామాలు ఉండగా అందులో శావల్యాపురం మండలంలో 24 గ్రామాలను ఫ్లోరోసిస్ గ్రామాలుగా గుర్తించామన్నారు.

ప్రతీ లీటరు మంచినీటిలో 1 మిల్లీగ్రాం ఫ్లోరోసిస్ మించరాదన్నారు. ప్రభుత్వం గతంలో మెడ బెల్ట్‌లు 1600, నడుము బెల్ట్‌లు 1100, వాకింగ్ కర్రలు 600, వీల్‌చైర్లు కుర్చీలు 21 మంది లబ్ధిదారులకు అందజేశామన్నారు. ప్రతి గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడే వారిని గుర్తించి సత్వరమే వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాలన్నారు. గ్రామాల్లో అర్హత కల్గిన లబ్ధిదారుల సమగ్ర వివరాలు సేకరించి ఆన్‌లైన్ నమోదు చేయటం ద్వారా వాకింగ్ కర్రలు, మెడ బెల్టులు, నడుము బెల్ట్‌లు, వీల్‌చైర్లు ప్రభుత్వ పరంగా మంజూరు చేస్తామన్నారు. దంతాలు, ఎముకల పటిష్టత తదితర వాటిని పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, రెండవ వైద్యాధికారి యం.రాధాకృష్ణణ్, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, సాయిగీతా, ఉమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



చిలకలూరిపేటటౌన్: భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చేనేత వస్త్రాలు ప్రత్యేక పాత్ర పోషించాయని బీసీసంఘ నియోజకవర్గ అధ్యక్షుడు కాకుమాను రమేష్ చెప్పారు. జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని మార్కెండేయనగర్‌లో పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 50 సంవత్సరాలు చేనేత వృత్తిలో ఉన్నవారిని సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చేనేత వస్త్రాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘ అధ్యక్షుడు మనోహర్, సభ్యులు పోలయ్య, సాంబమూర్తి, శివశంకర్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా నిర్వహించాలి

నాదెండ్ల: ఓటర్ల జాబితాను పారదర్శకంగా విచారణ జరిపి కొత్త వారి పేర్ల నమోదు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు ప్రక్రియను ఈనెల 21లోపు పూర్తి చేయాలని తహసీల్దార్ ఎ.వెంకటరమణ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు ఓటర్ల జాబితాపై అవగాహన కల్పించారు. 1-57 పోలింగ్ బూత్‌ల్లో వివరాలు నమోదు చేసుకుని 21వ తేదీ సాయంత్రం నాటికి కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, ఆర్ఐ రమీజా ఉన్నారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: ఓటర్ల జాబితా సర్వే బీఎల్‌వోలు పారదర్శకంగా చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబితా సర్వే ప్రక్రియ, జగనన్న పాలవెల్లువ, నా భూమి-నాదేశం నేలతల్లికి సమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలపై అన్నీ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, గృహనిర్మాణ శాఖాధికారి వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com